క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



పాఠ్యాంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం

పాణ్యం: మండలంలోని పలు పాఠశాలలను ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీయాలని, విద్యా బోధనతో పాటు క్రీడా, సాంకేతిక విద్య, ఆటపాటలు తదితర వాటిపై విద్యార్థులు అసక్తి చూపేలా బోధన చేయాలన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ఏమైన లోటుపాట్లు ఉంటే సూచించాలన్నారు.

పంట నమోదు చేసుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి

కల్లూరు: ఖరీఫ్ సీజనల్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి పి.ఎల్. వరలక్ష్మి అన్నారు. గురువారం కల్లూరు మండలం ఎ.గోకులపాడు గ్రామంలో జరుగుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. పంట నమోదుతో పాటు ఈకేవైసి కూడా పూర్తి చేయాలని వీఏఏ/వీహెచ్‌ఈ/ఎంపీఈఓలకు సూచించారు. వ్యవసాయ పరికరాలు అన్ని వ్యవసాయ యాంత్రీకరణ జాబితా అనువర్తనం అనే యాప్‌లో పొందుపర్చాలన్నారు. కొత్తగా వ్యవసాయ యాంత్ర పరికాలు అవసం ఉన్న రైతుల జాబితాను సేకరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో కర్నూలు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సాలు రెడ్డి, మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలో సాయిబాబా ఆలయం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలైనట్లు హైవే పోలీసులు గురువారం తెలిపారు. సాయిబాబా ఆలయం వద్ద ప్లాస్టిక్ వస్తువులు ఎరుకుంటున్న వృద్ధుడిని కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో వృద్ధుకి గాయాలుకాగా చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. కాగా, వృద్ధుడి వివరాలు తెలియాల్సి ఉంది.

బదిలీ వైద్యుడికి సన్మానం



డాక్టర్ అమర్నాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిగా పనిచేసిన డాక్టర్ అమర్నాథ్‌రెడ్డి బదిలీపై వెళ్లడంతో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ రేఖా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది అమర్నాథ్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి, బొకే, జ్ఞాపికలు అందజేసి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది విలియం రాబర్టు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సత్యనారాయణ, సూపర్‌వైజర్ శిలువజ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్‌కు నివాళి



డాక్టర్ స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పించిన రైతు సంఘం నాయకులు

కర్నూలు(రూరల్): మండల పరిధి ఉల్చాల గ్రామంలో డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామక్రిష్ణ హాజరయ్యారు. స్వామినాథన్ నిరంతరం వ్యవసాయ సమస్యలపై అధ్యయనం చేశారని కొనియాడారు. నూతన వంగడాలపై పరిశోధనలు సాగించి వ్యవసాయంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చారన్నారు. కనీస మద్దతు ధర చట్టం కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. రైతు సంఘం నాయకులు మద్దిలేటి, శ్రీనివాసరెడ్డి, హుస్సేన్, కృష్ణ, బడే సాహెబ్, భీమేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

- రోడ్లపై అడుగడుగునా గుంతలు
- అడుగుతీసి అడుగు వేయాలంటే నరకమే
- పట్టించుకోని పాలకులు, అధికారులు



గుంతలు పడి కంకర తేలిన తులశాపురం రోడ్డు



గార్గేయపురం బీసీ కాలనీ వద్ద రోడ్డుపై గుంతలు



దిగువపాడు రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపునీరు

కర్నూలు(రూరల్): కూటమి ప్రభుత్వం జనవరి నాటికే రోడ్లన్నింటినీ అద్దాల్లా మారుస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేసింది. అయితే కనీసం రోడ్లపై గుంతలను కూడా పూడ్చలేక చేతులెత్తేసింది. అధికారం చేపట్టి ఏడాది దాటినా రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదు. ఫలితంగా గుంతలు పడిన రహదారుల్లో ప్రయాణం చేసేందుకు ప్రజలు జంకుతున్నారు. గుంతల్లో కనీసం తట్ట మట్టి పోసిన దాఖలాలు కూడా లేవు. రోడ్లకు బాగు చేసేందుకు అధికారులు కనీసం ప్రాతిపాదనలు కూడా తయారు చేయకపోగా పాలకులు రోడ్ల గురించి ఎప్పుడో మరచిపోయారు.

ఈ రోడ్డు పై ప్రయాణం ఎలా?

మండలంలోని దిగువపాడు - గార్గేయపురం 3 కిలోమీటర్ల రహదారి అడుగుకో గొయ్యి, గజానికో గుంత ఉండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకం చూస్తున్నారు. గోతుల వల్ల ఒళ్లు హూనం కావడంతో పాటు వాహనాలు దెబ్బతింటున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. రోడ్డు మొత్తం కంకర లేచి ప్రమాదకరంగా మారింది. ప్రమాదకరంగా మారిన రోడ్డుపై ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి బైకర్లు గాయాలపాలవుతున్నారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు?

మండల పరిధిలోని సుంకేసుల స్టేజీ నుంచి తులశాపురం గ్రామం వరకు 2 కిలోమీటర్ల రహదారి అధ్వానంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై పలుచోట్ల కంకర తేలి గోతులమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బసాపురం గ్రామానికి రేమట నుంచి పంచాయతీరాజ్ విభాగంలో రోడ్డు ఉంది. ఎన్నో ఏళ్లుగా రోడ్డును బాగు చేయకపోవడంతో మట్టి రోడ్డులా మారింది. వర్షం వస్తే గ్రామస్తుల ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉంటున్నాయి. నందనపల్లె నుంచి నూతనపల్లె రోడ్డు, సూదిరెడ్డిపల్లె నుంచి నూతపపల్లె రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. పుల్లారెడ్డి కాలేజీ పక్క నుంచి దిన్నెదేవరపాడు గ్రామం వరకు రోడ్డుపై గుంతలు పడి కంకర తేలడంతో నిత్యం వందలాది వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత అధ్వానంగా ఉన్న రోడ్డును కూడా పంచాయతీ రాజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. తాము అధికారంలోకి వచ్చాక రోడ్లను అద్దాల్లా మారుస్తామని హామిలిచ్చిన నాయకులు ఇప్పుడు అటువైపు తొంగి చూడకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అద్దంలా కాదు కదా.. కనీసం మరమ్మతులైనా చేపట్టకపోవడంతో ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారు.

అమ్మో!.. ఆర్.కె.దుద్యాల రోడ్డు



ఆర్.కె.దుద్యాల రోడ్డు దుస్థితి

మండలంలోని ఆర్.కె.దుద్యాల రోడ్డు అడుగుపెడితే ఒళ్లు గుల్ల అనేలా ఉంది. సుంకేసుల స్టేజీ నుంచి 1.8 కి.మీ. ఉండే ఈ రోడ్డును ఎప్పుడో 20 ఏళ్ల క్రితం పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిర్మించారు. ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు పరిస్థితి ఆధ్వానంగా తయారైంది. రోడ్డు రూపురేఖలు మారి ఆనవాళ్లు కోల్పోయింది. దీంతో అత్యవసర సమయంలోనూ అంబులెన్సులు రావు. దీంతో మహిళలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలతో మంచానికే పరిమితమైనవారు చికిత్స కోసం వెళ్లాలంటే ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. పాలకులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ప్రజలు నిత్యం సమస్యలతో సహజీవనం చేయల్సి వస్తోంది.

మరమ్మతులకు దిక్కు లేదు



మా గ్రామానికి గార్గేయపురం నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. ఈ రోడ్డు ప్రస్తుతం అధ్వానంగా మారింది. ప్రధానంగా హంద్రీ - నీవా కాలువ వంతెన, నాంబాయి చేను, దేవుడి మాన్యం వద్ద రోడ్డుపై పెద్ద గోతులు ఏర్పడాయి. కొద్ది పాటి వర్షం కురిసినా వారం రోజుల పాటు గోతుల్లో నీరు ఉండిపోతుంది. దీంతో ఆటోవాలాలు, వ్యాన్‌లు, బస్సులు, వివిధ పనులకు వెళ్లే కూలీలు ప్రయాణం చేయలంటే నరకప్రాయంగా మారింది. పాత రోడ్డు కోతకు గురవుతూ ప్రమాదకరంగా మారింది. దీంతో మండల కేంద్రానికి వెళ్లేందుకు ప్రయాణికులు హడలిపోతున్నారు. - ఆర్.సుంకన్న, దిగువపాడు గ్రామం

తర్వలో రోడ్డు పనులు చేపడతాం



మండల పరిధిలోని ఆర్.కే.దుద్యాల గ్రామ రోడ్డు 1.6 కిలోమీటర్లకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. దాదాపు రూ.1.20 కోట్లతో తర్వలో రోడ్డు పనులు ప్రారంభిస్తాం. బసవపురం రోడ్డు దుస్థితిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. మండలంలో ఆయా గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదికలు పంపాం. - ముక్తార్ బాషా, పంచాయితీ రాజ్ ఏఈ, కర్నూలు మండలం

చేనేతల సమస్యలపై పోరాటం



మహాత్మ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

కోడుమూరు రూరల్: సమస్యల పరిష్కారం కోసం చేనేత కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి పిలుపునిచ్చారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని సీపీఐ, సీపీఎం, చేనేత కార్మిక సంఘం నాయకులు గాంధీజీ విగ్రహానికి పూలమాల, చిట్యాల నూలు దండలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత కార్మికులను దుశ్శాలువాతో పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాధవస్వామి మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేనేత కార్మికులకు వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ.24 వేలు ఇచ్చి ఆదుకునేదన్నారు. కూటమి ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.36 వేలకు పెంచి కార్మికులకు తక్షణమే అందజేయాలని, చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం, చేనేత కార్మిక సంఘం నాయకులు రాజు, గపూర్‌మియ్యా, రాజు, శేషుకుమార్, లక్ష్మన్న, వీరన్న, మహబూబ్‌బాషా, శ్రీరాములు, రమేష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత జెండావిష్కరణ

జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని కోడుమూరులో చేనేత కార్మిక సంఘం నాయకులు, కుర్ని కులస్తులు ముఖ్య అతిథుల చేతుల మీదుగా చేనేత జెండాను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను దుశ్శాలువాతో సత్కరించి చేనేతల గొప్పతనాన్ని వక్తలు వివరించారు. సీనియర్ నాయకుడు అమడగుంట్ల క్రిష్టారెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ సీబీ అజయ్‌కుమార్, భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మణి, చేనేత కార్మిక సంఘం నాయకులు దానకర్ణ, గోట్ల విజయ్‌బాబు, వెంకటేశ్వర్లు, శ్రీరాములు, రాఘవేంద్ర, భాస్కర్, తదితరులున్నారు.

హౌసింగ్ అడ్వాన్స్ డబ్బులు తిరిగివ్వండి



సర్పంచు బ్రహ్మయ్యకు నోటీసులు ఇస్తున్న హౌసింగ్ అధికారులు

ఓర్వకల్లు : గృహ నిర్మాణ సంస్థ ద్వారా అడ్వాన్స్ తీసుకున్న డబ్బును లబ్ధిదారులు తిరిగి ప్రభుత్వాని చెల్లించాలని హౌసింగ్ అధికారులు తెలిపారు. గురువారం మండలంలోని నన్నూరు గ్రామంలో ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ శ్రీధర్, సిబ్బందితో కలిసి లబ్ధిదారుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ఏఈ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీ, సొంత స్థలాలలో ఇళ్లు నిర్మించుకుంటామని ప్రభుత్వం నుంచి రూ.30,000, రూ.20,000, రూ.15,000 ల చొప్పున అడ్వాన్స్ రూపంలో తీసుకున్నారన్నారు. వాళ్లల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టని వారు అడ్వాన్స్ సొమ్మును తిరిగి హౌసింగ్ కార్పొరేషన్‌కు చెక్కు రూపంలో చెల్లించాలని తెలిపారు. అడ్వాన్స్ సొమ్మును తిరిగి చెల్లించని ఎడల ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా నన్నూరు గ్రామ సర్పంచు బ్రహ్మయ్యకు నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్కు ఇన్‌స్పెక్టర్ రామునాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న డీహెచ్ఓ డాక్టర్ జఫ్రుల్లా

ఓర్వకల్లు : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జఫ్రుల్లా అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఓర్వకల్లు క్లస్టర్ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సిబ్బంది వివరాలు, ఆసుపత్రిలో చేరిన రోగులు, బయట రోగుల వివరాలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అన్ని సముదాయాలు వున్నాయా? సిబ్బంది కొరత తదితర అంశాలపై వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి, ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్ శాతం పెంచాలని సూచించారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని, రోగులను ఇబ్బందులకు గురిచేయకుండా జవాబుదారీగా పనిచేయాలన్నారు. ఆసుపత్రిలో శుభ్రతను పరిశీలించి, రోగులతో మాట్లాడి వారి బాగోగుల తెలుసుకున్నారు. సమావేశంలో డాక్టర్ దాదాబాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న చినుకులకే పెద్ద మడుగులు!



సి.బెళగల్‌లో చిత్తడిగా మారిన ప్రధాన రోడ్డు

సి.బెళగల్: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు అధ్వానంగా మారింది. దీనికి తోడు చిన్నపాటి చినుకులు కురిస్తే ఇక అంతే సంగతులు. ప్రధాన రోడ్డు చిత్తడిగా మారడంతో పాటు, అడుకో మడుగును తలపించేలా రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉంటుంది. గురువారం సాయంత్రం చిన్నపాటి జల్లులతో వర్షం కురిసింది. దీంతో ఎమ్మిగనూరు - కర్నూలు ప్రధాన రోడ్డు చిత్తడిగా మారి అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. రోడ్డుపై అడుగడుగునా గోతులు ఏర్పడి వర్షపు నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రోడ్డు అధ్వాన పరిస్థితిపై ప్రజలు, వాహనదారులు అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. రోడ్డు ఎప్పుడు బాగుపడేనో అని మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

నులిపురుగు నివారణకు మాత్రలు వేసుకోవాలి



పోస్టర్ విడుదల చేస్తున్న డాక్టర్ రఘు

ఓర్వకల్లు : నులిపురుగు నివారణకు సరైన మాత్రలు వేసుకోవాలని సంచార వైద్య చికిత్స జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. గురువారం నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో జరుగుతున్న సంచార వైద్య చికత్స కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కడుపులో నులిపురుగులు వున్నట్లయితే శరీరం తెల్లగా పాలిపోవడం, అరచేతులు, అరికాళ్లలో విపరీతమైన దురద రావడం, అలర్జీ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అంతేగాక, మనిషి నీరసించిపోడవం, నిస్సత్తువగా కనిపించి, కళ్లు తిరిగి పడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. దీనికి ప్రతి ఆరునెలలకు ఒకసారి నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని సూచించారు. మాత్రలను కడుపులోకి మింగకుండా, చప్పరించడం వల్ల ఒకటి రెండు రోజుల్లో కడుపులోంచి మల విసర్జన ద్వారా పురుగులు బయటకొస్తాయన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భువనతేజ, సామాజిక ఆరోగ్య అధికారి మహేశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు, ప్రాజెక్ట నిస్టు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం మండలంలో భారీ వర్షం



కౌలూరు మెట్ట వద్ద కురుస్తున్న వర్షం

పాణ్యం : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం పాణ్యం గ్రామం మొదలుకొని చూట్టు పక్కల గ్రామాల్లో, మధ్యాహ్నం కౌలూరు, బలపనూరు, నెరవాడ, రసూళ్లపేట, వడ్డుగండ్లతో పాటు పలు గ్రామాల్లో ఓ మోస్తరు వాన పడింది. దీంతో మెట్ట పొలాలు సాగుచేసే రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఏకధాటిగా గంట పాటు వర్షం కురవడంతో మెట్ట పొలాలు పదునయ్యాయి.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

కోడుమూరు రూరల్: ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు ఆంధ్రయ్య గురువారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా సప్పోగు నాగేష్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా వెంకటరాముడు, సభ్యులుగా మోహన్న, సందీప్, గిరి, లాలు, అయ్యన్న, రత్నం, రాముడును ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కమిటీ సభ్యులను కార్యకర్తలు సత్కరించారు.

కొండాపురం వద్ద కమ్మేసిన మంచు



నదితీర గ్రామాల్లో మంచు దుప్పటి

సి.బెళగల్: మండలంలోని నదితీర గ్రామాల్లో గురువారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి పొగమంచు కమ్మేసింది. నదితీర గ్రామాలైన సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్‌దొడ్డి, ముడుమాల గ్రామాల వద్ద సాయంత్రం ఉన్నటుండి దట్టమైన పొగ మంచు ఏర్పడింది. సమీపంలోని వ్యక్తులు, వస్తువులు సైతం స్పష్టంగా కనిపించనంతగా మంచు అలుముకుంది. పంట పొలాల్లో శీతాకాలాన్ని తలపించేలా మంచు మబ్బులు ఏర్పడ్డాయి. ఒక పక్క ఆకాశంలో మేఘాలు కమ్ముకోగా, మరోపక్క ఆకస్మికంగా ఏర్పడ్డ మంచు తెరలను చూసి ఆయా గ్రామాల ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం



పోలకల్‌లో రైతులతో మాట్లాడుతున్న హెచ్ఓ మదన్‌మోహన్

సి.బెళగల్: రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ముందుకు రావాలని హార్టికల్చర్ అధికారి (హెచ్‌ఓ) మదన్‌మోహన్ కోరారు. ఆయన గురువారం మండల పరిధిలోని పోలకల్, సంగాల గ్రామాల్లో పర్యటించి, ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ పంటలను పరిశీలించారు. పంటల సంరక్షణపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆయిల్ పామ్‌పై ఆసక్తి ఉన్న రైతులకు పతాంజలి కంపెనీ ద్వారా వంద శాతం ఉచితంగా మొక్కలను అందజేయడం జరుగుతుందని, అదేవిధంగా ఎరువులు, పురుగు మందులను సబ్సిడీపై అందిస్తామన్నారు. మండలంలో ఆసక్తి ఉన్న రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. వీఏఏలు శశికాంత్, లలిత, దేవ్, రైతులు ఉన్నారు.

ఎమ్మెల్సీపై దాడి పిరికిపంద చర్య



నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నాయకులు

కల్లూరు: ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి చేయడం పిరికిపంద చర్య అని వైఎస్సార్‌సీపీ పాణ్యం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు భవాని యాదవ్ అన్నారు. ఎమ్మెల్సీ రాచగొల్ల రమేష్ యాదవ్‌పై దాడిని ఖండిస్తూ గురువారం కర్నూలు నగరం పూలే సర్కిల్ (బిర్లాగేట్ సర్కిల్) వద్ద ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో నిరసన చేశారు. భవాని యాదవ్ మాట్లాడుతూ పులివెందులలో జెడ్పీటీసీ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామని భయంతో టీడీపీ నాయకులు దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఎక్కాడా లేని విధంగా రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అధికారన్ని అడ్డం పెట్టుకుని వైఎస్సార్‌సీపీలో చురుకుగా ఉన్న నాయకులను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు కేసులు పెడుతూ భయభ్రాంతాలకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచక పాలనను ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు చంద్రిక, రాము యాదవ్, పండు, శ్రీనివాస్ యాదవ్, వాలి, గోపాల్, నాగరాజు, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామానికి యూరియా కేటాయించండి



అళ్లగడ్డ గ్రామానికి యూరియాను కేటాయించాలని కోరుతున్న రైతులు

గడివేముల: మా గ్రామానికి యూరియా కేటాయించండని మండల పరిధిలోని బిలకలగూడూరు మజరా గ్రామమైన అళ్లగడ్డ గ్రామానికి చెందిన రైతులు కోరుతున్నారు. మా గ్రామానికి ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఇంత వరకు ఒక్క బస్తా యూరియా కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో దాదాపు 60 నుంచి 80 మంది దాకా రైతులు వివిధ పంటలు సాగు చేశారు. బిలకలగూడూరు రైతు సేవాకేంద్రానికి యూరియా వస్తుండటంతో అక్కడే అన్ని బస్తాలు ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి మా గ్రామానికి యూరియా కేటాయించి మమ్మల్ని రైతులమని గుర్తించాలని అళ్లగడ్డ రైతుల కోరుతున్నారు.

పేదలకు సహకారమందించాలి



మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్

కల్లూరు: నగరంలోని పారిశ్రామిక వేత్తలు పేద ప్రజల అభ్యున్నతికి సహకారం అందించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. గురువారం కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏపీఐఐసీ కార్యాలయం వద్ద పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం రూపొందించిన పీ-4 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు పారిశ్రామికవేత్తలు సహకరించాలని కోరారు. అన్ని రంగాల్లో ముందున్న సంపన్నులు పీ-4 కార్యక్రమంలో మార్గదర్శకులుగా నమోదు చేసుకుని, వెనుకబడిన కుటుంబాలకు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, నోడల్ అధికారులు వాజిద్, మన్సూర్, సుహైల్, రాజు తదితరులు పాల్గొన్నారు.